

# విరహిణి

**రష్యన్‌మూలం: చెహోవ్**

**తెలుగు గొంతు: కరుణారుణ**

మనిషి అందగాడే. దృఢమైన శరీరం. కాని సావ్కా ఒట్టి సోమరి. ముక్కుమీద ఈగ వాలితే తీసేసుకోవటానిక్కూడా బద్ధకం. అత్యవసరమైతే తప్ప వేలుకూడా కదల్చని స్వభావం.

కొన్నాళ్లు సరదాగా గడపటానికి నేను డుచోవ్‌స్కీ గార్డెన్స్‌కి వెళ్లినప్పుడు అక్కడ వాచ్‌మన్‌గా వున్నాడు సావ్కా. కొద్దో గొప్పో చదువుకున్నవాడే. తాగుడులాంటి దురలవాట్లేమీ లేవు. సొంత పొలం కూడా వుంది (వుండేది). కాని ఒళ్లొంచి దుక్కి దున్నితే కదా సాగయ్యేది. తల్లి వూరు తిరిగి, తిండి తెచ్చిపెట్టేది. వీడు తిని, త్రేన్చి కాలుమీద కాలేసుకుని చుక్కల్ని లెక్కపెడుతూ పడుకునేవాడు. ఈ నిశ్చలత్వం ఆధ్యాత్మికులకు అలంకారమేమో గాని, యిలా వుంటే కష్టజీవులకు కడుపెలా నిండుతుంది.

సాగుచేసినా చెయ్యకపోయినా పన్నులు కట్టక తప్పదు. అప్పులు. తిరిగి చూసేలోగా వున్నదేదో హరించుకుపోయింది. ఊరిపెద్దలు జాలిపడి, "దిష్టిబొమ్మలాగా అక్కడైనా కూర్చోపోరా" అని ఈ వాచ్‌మన్ నౌకరీ యిప్పించారు.

ఒక మే నెల సాయంత్రం, సావ్కా గుడిశ పక్కనే రగ్గు పరుచుకుని కూర్చున్నాడు. కిందికి వాలిన చెట్లకొమ్మలు. చల్లగా గడ్డి, మొక్కల, మట్టి వాసనలు కలిసి మత్తెక్కిస్తున్నాయి. పక్కన ఒక పార, ఆ పక్కన సావ్కా పెంచుకుంటున్న కుక్క. ఎదురుగా నాలుగడుగులు కిందికి దిగితే ప్రశాంతంగా ప్రవహిస్తున్న చిన్న నది. నదికి అద్దరి కొండ మీద మినుకు మినుకు దీపాలతో వెలిగే యిళ్లు. పక్షుల గోల హద్దు మీరిపోయింది. కొజ్జు పిట్టలు, గోరింకలు, వడ్రంగి పిట్టలు పోటీపడి మరీ అరుస్తున్నాయి. చీకటి ముసురుకుంటున్నది. ఈదరంగాలి మొదలైంది. సావ్కా తన మౌనముద్రలో చేతులు తలకింద పెట్టుకుని పడుకున్నాడు. చాపలకోసం నేను గాలాలు నదిలోకి విసిరి ఎంతసేపైందో... ఒక్కటీ చిక్కలేదు. చేసేదేముంది, నిరీక్షించడం తప్ప.



"నైటింగేల్స్ పాటలు వినిపించడం లేదేమిటి?" అంటూ అడిగాను.

జవాబుగా సావ్కా గొంతులో నైటింగేల్ పలికింది.

దానికి జవాబు అసలు నైటింగేల్.

"వినిపించిందా?" అంటూ నవ్వాడు సావ్కా.

పక్షులు చెట్లమీద గూళ్లు కట్టుకుంటాయి. ఆకాశంలో ఎగురుతాయి.

"వాటి అసలిల్లేదీ?"

"ఇక్కడే గుడ్లు పెడతాయి. పొదుగుతాయి. అందువల్ల యిదే అసలిల్లు." అన్నాను.

"మీరివ్వాళ యిక్కడికొస్తారని తెలియదు. నాకోసం ఓ మనిషి వస్తానన్నది. మీరు వస్తారని తెలిసుంటే దాన్ని రేపు రమ్మని చెప్పేవాణ్ణి." అన్నాడు సావ్కా సడన్‌గా ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలాగ.

"ఫరవాలేదు. నేను వెళ్లిపోతాను."

"మీరుండండి సార్. దాన్నే రేపు రమ్మంటాను. ఈ ఆడవాళ్లు ప్రాణాలు తీస్తారండీ. ఒక్కటే నస."

"దార్యానా వచ్చేది?"

"కాదండి. మరో కొత్తమనిషి అగాఫియా." అన్నాడు. సావ్కా అందరాడాళ్లూ ఒక్కటే అన్నట్టుగా, అసలు సావ్కా దృష్టిలో స్త్రీలకూ, వస్తువులకూ, పశుపక్షులకూ పెద్ద తేడా లేదు.

అగాఫియా నాకు తెలుసు. ఇరవైయేళ్లుంటాయేమో. పోయిన ఏడాదే రైల్వే వాచ్‌మన్‌తో పెళ్లైంది. కుర్రాడు చూడ్డానికి బాగానే వుంటాడు. గేట్ దగ్గర డ్యూటీ లేనప్పుడు యిద్దరూ సఖ్యంగానే వుంటారు.

"చూస్తూ వుండు. ఈ ఆడవాళ్ల పరిచయం నీకు కీడు చేస్తుంది." అన్నాడు.

"కానివ్వండి."

ఓ నిమిషం ఆగి,

"ఏం చెయ్యానండీ? ఎంత చెప్పినా వినరు. పైగా 'కీడు' నాకన్నా వాళ్లకే ఎక్కువగదా! అయినా వస్తారు." అన్నాడు.

చీకటి దట్టమైంది. బలహీనమైన చుక్కలకాంతి తప్ప మరే వెలుగూ లేదు. అప్పుడప్పుడూ ఏదో ఒక పక్షికూత. కీటకాల రొద. అంతటా నిశ్శబ్దం.

"ఏం సార్, అలా మౌనంగా వున్నారు. ఏదన్నా తిందాం రండి." అంటూ మాట కలిపాడు సావ్కా. గుడిశెలోకెళ్లి, ఓ డ్కా బాటిలూ, వెన్నపూసిన రొట్టే, బేక్ చేసిన గుడ్లూ పట్టుకొచ్చాడు.

"అన్నీ బాగానే సమకూర్చుకున్నావే?" అన్నాను. అంత మంచి భోజనానికి ఆశ్చర్యపడి.

"వాళ్లు తీసుకొస్తారండీ."

"ఎందుకు?"

"నామీద జాలిపడి మరెందుకు?" అన్నాడు సావ్కా చిరునవ్వుతూ. అప్పుడు జ్ఞాపకం వచ్చింది.

సావ్కా డ్రెస్సుకూడా ఆడవాళ్లు కుట్టినట్లుగా వుంది. ఎంబ్రాయిడరీ. అల్లిన దుస్తులు. పడుచుపిల్లలు సావ్కా అంటే పడిచస్తారు. కాని అతడికి ఆ విషయం మాట్లాడడం అసలు యిష్టం వుండదు.

"అదిగో, ఎవరో నదిని దాటుతున్నారు." అన్నాడు చెవులు రిక్కించి.

కుక్క మొరిగింది.

"దుస్తులు మోకాళ్లదాకా పైకి తీసుకుని నది దాటి వస్తున్నా అగాఫియా. అలసిపోయి రొప్పుతున్నది, నన్ను చూసి కాస్త బెదిరింది.

"భయపడకు. దా" అన్నాడు సావ్కా రొట్టెముక్క నములుతూ.

"నా భర్త నీకివ్వమని యివి పంపించాడు."

"సర్లే. సార్ కంతా తెలుసు. కూర్చో."

అగాఫియా సందేహిస్తూ నిల్చుంది.

"దా. ఓ చుక్క వోడ్కా వేస్కో. ఓ ముక్క తిను."

"ఏయ్, నేన్నీకు తాగే దానిలా కన్పిస్తున్నానా ఏమిటి?"

"ఫర్వాలేదు రావే. చుక్కేసుకుంటే వుషారుగా వుంటుంది."

అంటూ అగాఫియా చేతిలోని భోజనం మూట లాక్కుని విప్పాడు సావ్కా. "భలే. బంగాళాదుంపలు, ఖీమా."

ఆకారాలు స్పష్టంగా కనిపించకపోయినా పోల్చుకోగలిగాను.

అగాఫియా చూపులన్నీ సావ్కా మీదే.

"కాస్త అలా తిరిగొస్తాను. మీరు కబుర్లు చెప్పుకోండి." అంటూ లేచాను.

పక్షికూత.

"అదిగో గోరింక. నిన్నటిదే." అంటూ పట్టుకోవడానికి పరిగెత్తాను. చెప్పాను గదూ, సావ్కా బద్ధకస్తుడు. పక్షులను పట్టుకోవటం తెలియదతడికి. గోరింక జాడలో ఎటో మాయమయ్యాడు.

ఇద్దరమే మిగిలాం.

"ఎలా వుంది సంసారం, అగాఫియా?"

"బాగానే వుందండి. ఈ విషయం ఎవరికీ చెప్పరు గదూ!"

"నేను చెప్పనులే. అయినా నీ భర్తకు ఎప్పుడో అప్పుడు తెలియకుండా వుంటుందా?"

"తెలియదు."

"ఒకవేళ తెలిస్తే."

"ఆయన వచ్చేసరికి నేను యింట్లో వుంటానుగా. రైలు పోయిందాకా ఆయన రాడు."

ఆమె కళ్లు సావ్కా కోసం చూస్తున్నాయని తెలుసు.

"కాసేపట్లో రైలు వచ్చేస్తుంది. ఎక్కడికెళ్లాడీ మూర్ఖుడు!" అగాఫియా గొంతులో ఆత్రుత. భయం. కోరిక.

"సావ్కా" అరిచాను.

జాడలేదు.

"వెళ్లాలిక!" అగాఫియా గొంతు కంపించింది. ఆ మాటలో ప్రణయకోపమూ, అభ్యర్థనా వున్నాయి.

రైలు వస్తున్న శబ్దం.

"ఊ ఫూల్ ఎక్కడికెళ్లాడు? నేను వెళ్లాలబ్బా."

వాంఛా తీవ్రత.

ఇంజన్ లైట్లు. పొగ. కూత.

"ఛ. ఎప్పుడొస్తాడో? ఏమో."

ఘనకార్యం సాధించటానికి వెళ్లిన సావ్కా తిరిగి వచ్చాడు.

"దొంగముండ, చిక్కలేదు." అంటూ అగాఫియా నడుం మీద చెయ్యేసి కూలబడ్డాడు, "ఏమిటే, మూతి ముడుచుక్కూచున్నావ్" అంటో చెయ్యిపట్టి లాగాడు.

ఆడాళ్లు సావ్కా అంటే పడిచచ్చినా, సావ్కాకు

> "ఈ ఆడవాళ్లకు కొన్నిసార్లు ఎక్కడలేని ధైర్యమూ వస్తుంది. చెయ్యలేని పనులన్నీ చేస్తారు. అంతలోనే మళ్లి పిరికిపందల్లా తోకముడుచుకొని పారిపోతారు. ఇది చేసిన పని తెలిసిందంటే ఊళ్లో నన్ను చావదన్నుతారు...."

వాళ్లంటే అంత కోరిక లేదనుకుంటాను. వాళ్లు అతన్నెంత ముద్దు చేస్తే, అతడు వాళ్లనంత ఏడిపిస్తాడు. ఈ వూరూరి డల్సినియాల ధీర శృంగార పురుషుడు సావ్కా. అతడి ఎత్తిపొడుపు మాటలకు, చిలిపి చేష్టలకు క్షణిక తిరస్కారాలకు కరిగిపోవటమే వాళ్ల ఆనందం. లోకమంతా 'ఎందుకూ కొరగాని వాడ'ని తీసెయ్యటంలోనే వాళ్లకు సావ్కా పురుషత్వం అనుభవంలోకి వచ్చింది.

"ఎందుకొచ్చావో, ఆ సారుకు చెప్పు. పెళ్లైన మగవాలివి. ఎందుకొచ్చావో చెప్పవే. దా. మరో చుక్క వోడ్కా వేసుకో."

ఆ మాటలకు కోపం తెచ్చుకుంటుందేమో ననుకుంటున్నప్పుడు అగాఫియా కిసుక్కున నవ్వింది.

రైలు వెళ్లిపోయిందే. ఇప్పుడెలా మరి?

నేను కాసేపు అలా తిరిగివచ్చేసరికి సావ్కా గడ్డిమీదా, తన ప్రియుడి బాహుబంధంలో అగాఫియా. ఓడ్కా పనిచేస్తున్నది. సావ్కా తొడమీద అగాఫియా తల.

"రైలుపోయి చాలా సేపైంది." అన్నాను.

"పోవే. సిగ్గువిడిచినదానా, పోవే యికనైనా." అంటున్నాడు సావ్కా.

అగాఫియాకు కూడా వెళ్లాలనే వుంది. కాని వెళ్లలేదు. లేవబోయి మళ్లీ సావ్కా మీద వాలిపోయింది.

"ఏమైనా కానీ వెళ్లను."

నేను మళ్లీ నదిదాకా పచార్లు చేశాను. అటువైపు యిళ్లలో వెలుగు. చల్లటి గాలి.

"అ...గా...ఫి...యా..." దూరం నించి పిలుపు.

ఆమె భర్త. ఇంట్లో లేని భార్యకోసం వెదుకుతున్నాడు. తనను తాను మరిచి ప్రియుని కౌగిలిలో మత్తుగా వొదిగిన భార్య. సంసారంలో దొరకని మధుర క్షణాలకోసం నది దాటి వచ్చిన భార్య.

నదిలోని వరదలాగా నిద్ర ముంచుకు వచ్చింది.

"లేవండి సార్, లేవండి." సావ్కా నన్ను తడుతున్నాడు.

"అగాఫియా వెళ్లిపోయిందా?"

"లేదు."

దుస్తులూ, జుత్తూ చెదిరిన అగాఫియా అయిష్టంగా, అతి ప్రయత్నంమీద నది దాటుతున్నది.

"ఈ ఆడవాళ్లకు కొన్నిసార్లు ఎక్కడలేని ధైర్యమూ వస్తుంది. చెయ్యలేని పనులన్నీ చేస్తారు. అంతలోనే మళ్లి పిరికిపందల్లా తోకముడుచుకొని పారిపోతారు. ఇది చేసిన పని తెలిసిందంటే ఊళ్లో నన్ను చావదన్నుతారు...."

నది దాటి యింటివైపు నడిచింది అగాఫియా.

"భయపడిపోయిందిలేండి. దాని మొగుడు గంటసేపట్నుంచీ అరుస్తున్నాడు. వెళ్లవే అని ఎంత చెప్పినా వింటేనా!"

సావ్కా గర్వంగా నవ్వాడు.

భార్యకోసం నిరీక్షించిన ఆ భర్త ఏవాలోచించాడో? అగాఫియా మరొకసారి వెనుదిరిగి చూసింది మేం ఏమన్నా సాయం వస్తామనుకున్నదేమో!

"సావ్కా, నువ్వతడికి కన్పిస్తున్నావు. కనీసం ఆ పొదవెనక దాక్కో" అంటూ మందలించాను.

"లాభం లేదండీ. తన భార్య యింతరాత్రి యిక్కడికెందుకొచ్చిందో అతడికి తెలుసు. కూరగాయలు కోసుకోవటానికి ఆడవాళ్లు అర్ధరాత్రి తోటల చుట్టూ తిరగరు. ఆ మాత్రం తెలియదా అతడికి." అన్నాడు సావ్కా. వలలో చిక్కిన పక్షిని చూసిన జాలి.

"పిల్లికి చెలగాటం అంటారే, అలాగ."

ధైర్యంగా, ఏదో నిర్ణయం తీసుకున్నట్టుగా అగాఫియా భర్తవైపు నడిచింది. తన జీవితం తనది. ■